



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 271 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 20-1 -2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

# బీజేపీ సారథిగా నితిన్ నబీన్



## ఎన్నిక ఇక లాంఛనం.. నేడు అధికారిక ప్రకటన

- అధ్యక్ష పదవికి నామినేషన్ వేసింది ఆయనొక్కరే
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం.. ఇంటర్మీడియట్ విద్యార్హత
- తొలిసారి జాతీయ అధ్యక్షుడిగా బిహార్ నేత

**న్యూఢిల్లీ,-జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
భారతీయ జనతా పార్టీకి నూతన జాతీయ అధ్యక్షుడిగా ప్రస్తుత పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా ఎన్నిక కావడం లాంఛనప్రాయమైంది. 45 ఏళ్ల చరిత్ర గల బీజేపీకి తొలిసారిగా పార్టీ కంటే పిన్నవయస్సుగల నితిన్ నబీన్ తొలిసారి అధ్యక్షుడు కాబోతున్నారు. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, హర్దీపసింగ్ పురి,

-మిగతా 2 లో



# కవిత పార్టీకి పీకే వ్యూహం!

- ఆమెతో ప్రశాంత్ కిశోర్ వరుస భేటీలు
- ఇటీవల వరుసగా 5 రోజులు చర్చలు
- సీఎం దావోస్ పర్యటన దండగ: కవిత

**హైదరాబాద్, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. సొంతంగా రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఆ పార్టీ కోసం వ్యూహాలు రచించేందుకు ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే)తో చర్చలు జరుపుతున్నారు. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పరిరక్షణ కోసం కొత్త పార్టీ ఏర్పాటు అవసరమని కవిత ఇటీవలే ప్రకటించారు. ఆ పార్టీని వేగంగా ప్రజలకు చేరువ చేసేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. అందులో భాగంగానే పీకేతో కవిత చర్చలు జరుపుతున్నట్లు

-మిగతా 2 లో

# చిరస్థాయిగా మేడారం!


## చరిత్రలో నిలిచిపోయేలా ఆధునికీకరించాం

- రూ.101 కోట్లతో జాతరకు కొత్త రూపు
- పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్
- మనవడితో కలిసి సీఎం తులాభారం
- కుటుంబ సమేతంగా మొక్కుల సమర్పణ

**వరంగల్, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
మేడారం మహా జాతర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా గద్దెను ఆధునికీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తాను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. మేడారం మహా జాతరకు సంబంధించి రూ.101 కోట్లతో ఆధునికీకరించిన పలు అభివృద్ధి పనుల పైలాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. వీటిలో గద్దెల ఆధునికీకరణతోపాటు ప్రాకారం, ఫ్లోరింగ్, అంతర్గత డ్రైనేజీ, క్రౌడ్ లైటింగ్, వాచ్ టవర్, తొమ్మిది స్వాగత ద్వారాలు, హరిత హోటల్ నుంచి

-మిగతా 2 లో







# భారత్‌కు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు

- రెండు గంటల పర్యటనలో కీలక ఒప్పందాలు
- ప్రధాని మోదీతో పలు అంశాలపై విస్తృత చర్చలు

**న్యూఢిల్లీ,**
: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధికారిక బృందం సోమవారం రెండు గంటల పాటు భారత్‌లో పర్యటించి కీలక ఒప్పందాలను కుదుర్చుకొంది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందంలో అబుదాబి, దుబాయ్ రాచకుటుంబాల సభ్యులు కూడా ఉన్నారు. యూఏఈ ఉప ప్రధాని, రక్షణ మంత్రిగా వ్యవహరిస్తున్న దుబాయ్ క్రౌన్‌ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ మౌక్తం కూడా ఈ బృందంలో ఉన్నారు. వీరంతా ప్రధాని మోదీతో విస్తృతంగా చర్చలు జరిపి ఉగ్రవాద నిర్మూలన, కృత్రిమ మేథ, రక్షణ రంగంలో సహకారం, వ్యూహాత్మక పెట్టుబడులు తదితర రంగాల్లో ఒప్పందాలను కుదుర్చుకొని పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రి వెల్లడించారు. భారత్-యూఏఈల మధ్య రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన సంకల్ప లేఖ(లెటర్ ఆఫ్ ఇంటెంట్)పై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి.

-మిగతా 2 లో




# ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

- పోలండ్ విదేశాంగ మంత్రితో భేటీలో జైశంకర్
- ఉగ్రవాద నిర్మలనకు కలిసి పనిచేస్తామని పోలండ్ హామీ

**న్యూఢిల్లీ,-**
ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ సమర్థించదని, ప్రపంచ దేశాలను కూడా ఇదే కోరుతోందని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కీ బజీలి తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఢిల్లీలో సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. కాగా గతేడాది అక్టోబర్‌లో పాక్ పర్యటనకు వెళ్లిన సమయంలో పోలండ్ విదేశాంగ మంత్రి జమ్మూకశ్మీర్‌పై చేసిన సూచనలపై జైశంకర్ ఆయనకు చురకలు అంటించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు కూడా ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో రాడోస్లావ్‌కు తెలుసని

-మిగతా 2 లో

# ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!



- త్వరలో జర్మనీని దాటి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భావం
- రూ.3.63 లక్షలకు చేరనున్న స్థూల తలసరి ఆదాయం
- చైనా, ఇండోనేషియాల సరసనచేరనున్న భారత్.. ఎస్‌బీఐ విశ్లేషణ

**న్యూఢిల్లీ, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా ఉన్న చైనా, ఇండోనేషియాల సరసన భారత్ కూడా త్వరలోనే చేరనుంది. ఈ దశాబ్దం చివరి నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా అవతరించనుంది. స్థూల తలసరి ఆదాయం రూ.3,63,462(4 వేల డాలర్లు)కు చేరనుంది. అదేసమయంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కూడా మారనుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్

-మిగతా 2 లో

# హరీశ్‌రావుకు సిట్ నోటీసు

- ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఆదేశం
- సీఆర్పీసీ సెక్షన్ 160 కింద అందజేత
- మంగళవారం ఉదయం 11 గంటలకు రావాలంటూ సోమవారం రాత్రి నోటీసు
- నార్సింగ్ నివాసంలో సిబ్బందికి అందజేత
- సిద్దిపేట పర్యటనలో ఉన్న మాజీ మంత్రి
- హరీశ్‌రావుకు నోటీసు ఇదే తొలిసారి



**హైదరాబాద్, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం చోటుచేసుకుంది. మాజీ మంత్రి హరీశ్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మంగళవారమే (నేడు) జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద నోటీసు ఇచ్చింది.

-మిగతా 2 లో



# గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా ఏపీ

- తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటు చేశాం
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేశాం
- తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఏపీ ప్రజలకు బంగారు భవిష్యత్ కల్పించే బాధ్యత తనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్‌కు ఏపీ చిరునామాగా మారిందని పేర్కొన్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. తిరుపతిలో స్పేస్ సిటీ

-మిగతా 2 లో

# వీధి కుక్కలను చంపడం దారుణం

- వాటికి జీవించే హక్కును హరిస్తారా
- సినీనటి రేణూదేశాయ్ ఆగ్రహం




**హైదరాబాద్,-జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వీధి కుక్కలను చంపడంపై ప్రముఖ సినీనటి రేణూదేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల పేరుతో వాటిని హతమార్చడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ భూమిపై ప్రతి జీవికీ జీవించే హక్కు

-మిగతా 2 లో

# దావోస్‌లో భారత్ జోష్

- రామ్మోహన్ నాయుడు సహా కేంద్ర మంత్రులు, చంద్రబాబు సహా రాష్ట్రాల సీఎంలు హాజరు

2 లో



# బీజేపీ సారథిగా నితిన్ నబీన్

మొదటి తరువాయి

కిరణ్ రిజుజు తదితరులు నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నితిన్ నబీన్‌కు మద్దతుగా వివిధ రాష్ట్రాల పార్టీ అధ్యక్షుల నేతృత్వంలో, పార్టీ ముఖ్యనేతలు నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్లను దాఖలు చేయగా మొత్తం 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. బరిలో ఒక్కరే ఉండటంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవంగా ఖరారు కాగా, అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. మంగళవారం ఉదయం 11.30గంటల తర్వాత పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ముఖ్య నేతల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ రిటర్నింగ్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌తో కలిసి బీజేపీ నూతన అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. నితిన్ నబీన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ తెలుగు రాష్ట్రాల బీజేపీ నేతలు నామినేషన్ పత్రాలు సమర్పించారు. తెలంగాణ బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య నామినేషన్ పత్రాలను లక్ష్మణ్‌కు అందజేశారు. ఉమ్మడి బిహార్‌లోని రాంచీలో పుట్టిన నితిన్ నబీన్ తొలుత బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇంటర్‌మీడియట్ చదివిన ఆయన బీజేపీ తరఫున కొన్ని రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. బిహార్ బాంకీపూర్ నుంచి వరుసగా 4సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉంది. బిహార్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాకు ఎదిగిన తొలి నేత నితిన్ నబీన్.

## భారత్‌కు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు

మొదటి తరువాయి

ఏటా 50 లక్షల టన్నుల వంతున దీర్ఘకాలం పాటు ద్రవీకృత సహజ వాయువు(ఎల్‌ఎన్‌జీ) సరఫరాపై ఒప్పందం కుదిరింది. గుజరాత్‌లోని ధేలారాలో ఉన్న స్పెషల్ ఇన్‌వెస్టమెంట్ రీజియన్‌లో యూఈఏ పెట్టుబడులకు సంబంధించిన సంకల్ప లేఖపై కూడా సంతకాలు జరిగాయి. ఆహార భద్రత, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదిరింది. భారత్‌లో డాటా సెంటర్, సూపర్ కంప్యూటింగ్ క్లస్టర్, వినూత్నంగా 'డాటా ఎంబసీ' ఏర్పాటుపై చర్చలు జరిగాయి. సాంస్కృతిక రంగంలో సహకారంలో భాగంగా అబుదాబీలో 'హౌస్ ఆఫ్ ఇండియా' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# కవిత పార్టీకి పీకే వ్యూహం!

మొదటి తరువాయి

సమాచారం. సంక్రాంతి పండుగ సమయంలో 5 రోజులపాటు వరుస సమావేశాలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. పార్టీ ఏర్పాటుచేసిన వెంటనే ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లటంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. పార్టీ విధానాల రూపకల్పన కోసం ఇప్పటికే 50 కమిటీలతో కవిత అధ్యయనం చేయిస్తున్నారు. ఈ కమిటీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా కమిటీల సభ్యులు తమ అధ్యయనం గురించి ప్రాథమిక నివేదికలను సమర్పించారు.

**సీఎం దావోస్ పర్యటన దండగ**

పెట్టుబడులు తెస్తామంటూ విమానం ఎక్కడం, దిగడం తప్ప.. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనతో ఒరిగేది ఏమీలేదని.. ఖర్చులు దండగేనని కల్వకుంట్ల కవిత విమర్శించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడుల ప్రచారం తప్ప రెండేళ్లలో తెలంగాణకు మీరు తెచ్చిందేమిటో చెప్పాలని సోమవారం ఎక్స్ వేదికగా ఆమె సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమ్మిట్ ద్వారా 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.40,232 కోట్లు, 2025లో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని, అవి ఎక్కడున్నాయని నిలదీశారు. ఇటీవల రూ.కోట్ల ప్రజాధనం ఖర్చుచేసి హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ఊదరగొట్టారని మండిపడ్డారు.

## ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!

మొదటి తరువాయి

ఇండియా(ఎసబీఐ) తన విశ్లేషణలో స్పష్టం చేసింది. "భారత స్థూల తలసరి ఆదాయం రూ.3,63,462కు చేరనుందన్న అంచనాల నేపథ్యంలో ఎగువ మధ్య ఆదాయ దేశాలుగా ఉన్న చైనా, ఇండోనేషియాల సరసన భారత్ కూడా చేరనుంది"అని ఎస్‌బీఐ పేర్కొంది. ఈ విశ్లేషణకు ఇటీవల ప్రపంచ బ్యాంకు ఉదహరించిన అంశాలను జోడించింది. తలసరి స్థూల జాతీయ ఆదాయం ఆధారంగా ప్రపంచ బ్యాంకు వివిధ దేశాలను మధ్య అధిక ఆదాయ, ఉన్నత మధ్య ఆదాయ దేశాలుగా వర్గీకరించింది. దీనికిగాను 1990-2024 మధ్య గణాంకాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ లెక్కల ప్రకారం.. చైనా తలసరి ఆదాయం 1990లో 330 డాలర్లు ఉండగా.. 2024 నాటికి పుంజుకుని ఉన్నత మధ్య ఆదాయ దేశంగా మారింది. ప్రపంచ బ్యాంకు సూచీల ప్రకారం అల్పాదాయ దేశాలు 26 ఉండగా, దిగువ మధ్యస్థ ఆదాయ దేశాలుగా 50, ఉన్నత మధ్య ఆదాయ దేశాలుగా 54 ఉన్నాయి. ఇక, అధిక ఆదాయ దేశాల సంఖ్య పెరిగి 87కు చేరింది.రింది.

# దావోస్‌లో భారత్ జోష్

రామ్మోహన్ నాయుడు సహా కేంద్ర మంత్రులు, చంద్రబాబు సహా రాష్ట్రాల సీఎంలు హాజరు




**న్యూఢిల్లీ, జనవరి 19:** దావోస్ వేదికగా మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు భారత్ సిద్ధమైంది. సోమవారం నుంచి ఐదు రోజుల పాటు స్విట్జర్లాండ్‌లోని దావోసలో జరగనున్న 56వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, పారిశ్రామిక ప్రముఖులు ఇప్పటికే సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. జెన్సన్ హువాంగ్, సత్య నాదెళ్ల(ఏఐ) సహా ప్రపంచవ్యాప్తంగా 130 దేశాలకు చెందిన మూడు వేలమంది ప్రతినిధులు దావోస్ సదస్సులో పాల్గొంటున్నారు. ట్రంప్ సుంకాలు, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితికి గురి అవుతుండటంపై సదస్సులో చర్చించనున్నారు. కాగా, అమెరికా వ్యాపార బృందానికి ట్రంప్ నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అశ్వినీ వైష్ణవ్, శివరాజ్‌సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ జోషి; రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, దేవేంద్ర ఫడణవీస్, హేమంత్ సోరెన్, మోహన్ యాదవ్, హిమాంత బిశ్వా శర్మ తదితరులు ఇక్కడకు చేరుకున్నారు. మనదేశం నుంచి వందకుపైగా దిగ్గజ కంపెనీల సీఈవోలు దావోస్ చేరుకున్నారు.

# చిరస్థాయిగా మేడారం!

మొదటి తరువాయి



ఆర్టీసీ బస్టాండ్ వరకు సీసీ రోడ్డు, గద్దెల నుంచి జంపన్నవాగు వెళ్లే రహదారి విస్తరణ, రోడ్డు నిర్మాణం, కూడళ్ల అభివృద్ధి పనులు ఉన్నాయి. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, వన దేవతలకు మొక్కులు చెల్లించారు. సీఎం రేవంత్ రెడ్డి తన సతీమణి గీతారెడ్డి, కుమార్తె నైమిషా రెడ్డి, అల్లుడు శరత్, మనవడు రేయాన్ష్‌తో కలిసి పాల్గొనగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. ఈ సందర్భంగా పూజారులు, అతిథులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. "భవిష్యత్తు తరాలకు మేడారం చరిత్ర, ఆదివాసీల ఆచారాలు తెలిసేలా అద్భుతంగా ఆధునికీకరించడం జరిగింది. ఇందులో భాగస్వాములైన మంత్రులు, అధికారులు, పూజారులందరికీ అభినందనలు"అని వ్యాఖ్యానించారు.

**సీఎం తులాభారం**

సమ్మక్క, సారలమ్మలకు సీఎం రేవంత్ రెడ్డి బంగారం(బెల్లం)తో తులాభారం వేశారు. మనవడు రేయాన్ష్‌తో కలిసి తులాభారం వేయగా 68 కిలోల బంగారాన్ని తల్లులకు సమర్పించారు. అనంతరం వన దేవతలకు సీఎం కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, కుటుంబ సభ్యులు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లకు చీర, సారెతోపాటు వనదేవతల ప్రసాదాలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు కాక సారయ్య, సిద్దబోయిన అరుణ్, భోజారావు, కొక్కెర రమేశ్, రఘుపతిరావు, సిద్దబోయిన స్వామి బహూకరించి, ఘనంగా సన్మానించారు. సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం 6.25 గంటలకు మేడారం గద్దెల వద్దకు చేరుకున్నారు. తులాభారం, వన దేవతలకు మొక్కులు చెల్లించిన తర్వాత కొద్దిసేపు పూజారులు, మంత్రులతో గద్దెల ప్రాంగణంలో మాట్లాడారు. అనంతరం రూ.101 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

# గ్రీన్ హైడ్రోజన్‌కు చిరునామాగా ఏపీ

మొదటి తరువాయి

ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. విశాఖపట్నానికి వేల కోట్ల రూపాయలపెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. 2026లో డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్‌లు వస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తామని సీఎం ప్రకటించారు. స్విట్జర్లాండ్ జ్యూరిక్‌లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సీఎం వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రులు నారా

లోకేశ్, టీజీ భరత్ ఉన్నారు. జ్యూరిక్‌లో రెండోసారి తెలుగు డయాస్పోరాతో సీఎం, మంత్రులు సమావేశమైయ్యారు. డయాస్పోరా భేటీ కోసం జ్యూరిక్ వచ్చిన ఐరోపాలోని 20 దేశాల ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు. సంక్రాంతి పోటీలు నిర్వహించిన స్విట్జర్లాండ్ తెలుగు సంఘం విజేతలకు సీఎం చంద్రబాబు బహుమతులు అందజేశారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచానికే సేవలు అందించే నాయకత్వం భారత్ సొంతమని వ్యాఖ్యానించారు. ఇతర దేశస్థులతో భారతీయులు పాలునీళ్లలా కలిసిపోతారని అన్నారు. తన ఆలోచలను అన్నీ ఎప్పుడూ నూతనంగా ఉంటాయని తెలిపారు.

ఉద్యోగాలు చేయడం కాదని.. ఉపాధి కల్పించేలా తయారుకావాలని సీఎం చంద్రబాబు సూచించారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదంతో తాము ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఎన్‌ఐఆర్‌లను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రూ.50 కోట్ల కార్పస్‌ఫండ్ ఇస్తామని తెలిపారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో సన్‌రైజ్ కనెక్ట్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో ఒక్క ఏపీకే 25 శాతం వస్తున్నాయని తెలిపారు. భారత్‌కు అతిపెద్ద ఆస్తి... యువ జనాభా అని వ్యాఖ్యానించారు. 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుందని వివరించారు. 2047 నాటికి నెంబర్‌వన్ కమ్యూనిటీగా భారత్ ఉండాలని ఆకాంక్షించారు. 2047 నాటికి ప్రపంచంలోనే నెంబర్ వన్ కమ్యూనిటీగా తెలుగువాళ్లు ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## వీధి కుక్కలనుచంపడం దారుణం

మొదటి తరువాయి




ఉందని స్పష్టం చేస్తూ, కుక్కలను చంపడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. వీధి కుక్కలపై ద్వేషంతో మాట్లాడుతున్న కొందరిపై రేణూ దేశాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తున్నవారికి పిచ్చి పట్టిందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడులపై వస్తున్న విమర్శలపై ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. '100 కుక్కల్లో ఐదు కుక్కలు కరిస్తే మిగతా అన్నింటినీ చంపేయాలా?' అంటూ ప్రశ్నించారు. సమస్యకు పరిష్కారం హింస కాదని, సరైన నిర్వహణ, వ్యాక్సినేషన్ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. 'కేవలం కుక్కల వల్ల మృతి చెందినవారివే ప్రాణాలా?' అంటూ ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల్లో, దోమల వల్ల వచ్చే వ్యాధులతో చనిపోయిన వారి ప్రాణాలకు విలువ లేదా? అని ప్రశ్నిస్తూ, సమస్యలను సమగ్రంగా చూడాలని సూచించారు. వీధి కుక్కల హత్యలను ఖండిస్తూ.. 'ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది' అని స్పష్టం చేశారు. మనుషుల నిర్లక్ష్యం వల్లే చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, జంతువులపై నింద వేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. కుక్కలను చంపడం దారుణమని, ఇది మానవత్వానికి మచ్చ అంటూ వ్యాఖ్యానించారు. చట్టపరంగా కూడా జంతువులను హతమార్చడం నేరమని గుర్తు చేశారు.

ఈ అంశంపై మాట్లాడుతున్న సమయంలో మీడియా ప్రతినిధులతో జరిగిన వాగ్వాదంపై కూడా రేణూదేశాయ్ స్పందించారు. 'ఓ వ్యక్తి నన్ను ఉద్దేశించి మాట్లాడారని.. అందుకే ఆ వ్యక్తి గురించి మాట్లాడాల్సి వచ్చింది' అని స్పష్టం చేశారు. తాను ఎవరినీ అనవసరంగా అవమానించలేదని క్లారిటీ ఇచ్చారు. ఈ వివాదాన్ని రాజకీయ రంగుకు ముడిపెట్టడంపై రేణూదేశాయ్ అసహనం వ్యక్తం చేశారు. 'నాకు పాలిటిక్స్ ఇష్టం లేదని... నేను ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లడం లేదు. నా వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడొద్దు. అలానే నా వ్యక్తిగత జీవితాన్ని ఈ అంశానికి ముడిపెట్టకండి. నా పిల్లలను ఇందులోకి లాగొద్దు' అంటూ మీడియాకు రేణూదేశాయ్ విజ్ఞప్తి చేశారు.

## ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు



మొదటి తరువాయి

జైశంకర్ అన్నారు. దానిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే గానీ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి ఆజ్యం పోయకూడదని చురకలు అంటించారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను మాత్రమే లక్ష్యం చేసుకోవడం అన్యాయమన్నారు. భారత్-పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జైశంకర్ వ్యాఖ్యలపై రాడోస్లావ్ సికోర్స్కీ స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. పోలండ్ కూడా ఉగ్ర సమస్యలను ఎదుర్కొంటుందని తెలిపారు. కాగా గతేడాది పోలండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆ దేశ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

# హరీశ్‌రావుకు సిట్ నోటీసు

మొదటి తరువాయి

మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారుల ఎదుట హాజరు కావాలని అందులో పేర్కొంది. జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి ఈ నోటీసులను జారీ చేశారు. 2024 మార్చి పదో తేదీన నమోదైన కేసు క్రైం నంబరు 243/2024 ఐపీసీ సెక్షన్ 166, 409, 427, 201, 120(బీ) రెడ్‌విత్ 34.3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ 1984 సెక్షన్ 65, 66, 66(ఎఫ్)(1)(బీ)(2) అండ్ 70 ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ కింద పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు తదుపరి విచారణలో భాగంగా ఈ నోటీసులు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొన్ని వాస్తవాలు, ఘటనలపై మీకు అవగాహన ఉందని దర్యాప్తులో తెలిసిందని, దానిపై విచారించాల్సి ఉందని, మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. నిజానికి, హరీశ్ రావు తన సొంత నియోజకవర్గం సిద్దిపేట పర్యటనలో ఉండగా.. నార్సింగిలోని ఆయన నివాసానికి అధికారులు చేరుకున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా ఎవరూ లేరు.

దాంతో, నోటీసు కాపీని సిబ్బందికి అందజేశారు. కాగా, రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తొలిసారిగా బీఆర్‌ఎస్ కీలక నేతకు నోటీసులు జారీ చేయడం.. ఇప్పుడు ఏకంగా ఆయనను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు సిట్ సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ప్రస్తుత, మాజీ అధికారులు, రాజకీయ నాయకుల్ని విచారించిన సిట్.. విచారణలో లభించిన సమాచారం ఆధారంగా హరీశ్ రావును విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు సిద్ధమైంది. నిజానికి, సిట్ నుంచి తనకు నోటీసులు అందుతాయని హరీశ్‌రావు గతంలోనే ప్రకటించారు. పంచాయతీ ఎన్నికల ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారని, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తనకు ఇస్తారని ముందుగానే అంచనా వేసి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరాన్నిబట్టి అధికారులు ట్యాపింగ్ చేస్తారని హరీశ్‌రావు గతంలో వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక, పలువురు అధికారులు, నాయకులను విచారించిన తర్వాత దర్యాప్తులో భాగంగా హరీశ్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ముందు నుంచీ కేసీఆర్ పేరు వినిపిస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆయనకు కూడా నోటీసలు జారీ చేసి స్టేట్‌మెంట్ రికార్డు చేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# మహిళల ఆర్థిక అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## -ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మహిళల ఆర్థిక అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మహిళల సాధికారతా కోసం ప్రభుత్వం ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. సోమవారం ఆయన ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ.తొంబై మూడు లక్షల,తొంబై రెండు వేల,ఆరు వందల యాభై ఐదు చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం వడ్డీ లేని రుణాల





పథకాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ లభించేలా ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలకు బలోపేతం చేసిందని, ఆడపడుచులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గత ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికి ఎవరు చేయని విధంగా రాష్ట్రంలోని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అడుగులు వేస్తుందని కసిరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏనాడు పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఓట్ల కోసం వచ్చే ప్రతిపక్ష పార్టీలకు మహిళలు నిలదీయాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో, ఆర్డివో జగదీశ్వర్ రెడ్డి, తహాసీ ల్దార్ ఫహీమ్ ఖాద్రీ, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, ఏపీఎంలు, సీసీలు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మా అన్నయ్య, మండల అధ్యక్షుడు జగన్, గుర్రం కేశవులు, చెన్నారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, ఖాదర్ ఖాద్రీ, ఖాదర్, శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి ప్రసాద్,సురేష్ నాయక్,నాసర్, మహేష్,అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన కమిషనర్



**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సోమవారం ఆమనగల్లు పట్టణంలో శ్రీలక్ష్మి గార్డెన్ లో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ పూల కుండీ, శాలువాతో సన్మానించి కార్యక్రమానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మానయ్య, జగన్, ఖాదర్ ఖాద్రీ, గుర్రం కేశవులు, ఎంగలి ప్రసాద్, శ్రీను నాయక్, నాసర్, కృష్ణ నాయక్, శ్రీకాంత్,అంజత్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన విద్యాధికారి



**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మండల పరిధిలోని కోనపూర్ పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సోమవారం విద్యాధికారి పాండు పరిశీలించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ..క్రీడా ప్రాంగణాన్ని చదును చేయాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించడం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండు, ఎంపీడీవో కార్యాలయ సూపరిడెంట్, ఎంపీవో గ్రామ సర్పంచి పంచాయతీ కార్యదర్శి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వాలంబనే ప్రభుత్వ ద్యేయం

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే మహిళలకు ఆర్థిక సోవలంబన చేకూరుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు మహిళలు ఆర్థికంగా ఎదగాలనే దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం శ్రీలక్ష్మి గార్డెన్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలోని కోటి మంది



మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టిందని తెలిపారు. ఉచిత కరెంటు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడం ఆర్టీసీ బస్సుల కొనుగోలులో మహిళ సమైక్యాల భాగస్వామ్యం వడ్డీ లేని రుణాలు లాంటి అనేక పథకాలను మహిళలకు ఉపయోగపడే విధంగా మహిళ అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మా అన్నయ్య, మండల అధ్యక్షుడు జగన్, చెన్నారెడ్డి, కేశవులు, ఖాదర్ ఖాద్రీ, ఖాదర్, రహీం,ఎంగలీ ప్రసాద్, వ్యవసాయ డైరెక్టర్ శ్రీశైలం, శ్రీకాంత్,సురేష్, మహేష్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# లకుడారం గ్రామంలో నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ సభ




**కుకునూర్పల్లి, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కుకునూర్పల్లి మండలంలోని లకుడారం గ్రామంలో సోమవారం నాడు నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ సభ ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ శిల్ప నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధి దిశగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజల అవసరాలను తీర్చేందుకు, సమగ్ర అభివృద్ధి సాధించేందుకు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.గ్రామ ప్రజలందరూ పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా ముందుకు సాగి గ్రామాన్ని అభివృద్ధి పరచాలని సర్పంచ్ శిల్ప నరసింహులు పిలుపునిచ్చారు. ఆయన మాటల్లో గ్రామం కోసం ప్రతి ఒక్కరూ ఏకమై కృషి చేస్తే మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టమైంది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# మహాత్మా గాంధీ కలలు కన్న రామరాజ్యం కాంగ్రెస్ కు నచ్చడం లేదు

## - ఎంపీ రఘునందన్ రావు

**సిద్దిపేట, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో సోమవారం మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి పన్నెండు సంవత్సరాలు పూర్తయ్యాయని, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా అందేలా మోదీ ప్రభుత్వం కొత్త చట్టాలు తీసుకువచ్చిందని వివరించారు. మోదీ ప్రభుత్వం ఏ మంచి చట్టం తీసుకొచ్చినా కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుపడుతోందని, అందుకే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందని



విమర్శించారు.జాతీయ ఉపాధి హామీ పథకంలో పని దినాలను 100 నుండి 125 రోజులకు పెంచిన మోదీ ప్రభుత్వ నిర్ణయం వల్ల కాంగ్రెస్ నాయకులకు ఏం నష్టం జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాలనలో ఈ పథకానికి మూడు లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, మోదీ ప్రభుత్వం కేవలం తొమ్మిది సంవత్సరాల్లోనే తొమ్మిది లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని వివరించారు. 'వీబీజీ రామ్ జీ' అనే పేరు కాంగ్రెస్?ను కలవరపెడుతోందని, మహాత్మా గాంధీ కలలు కన్న రామరాజ్యం కాంగ్రెస్?కు నచ్చడం లేదని, గాంధీజీ సమాధిపై ఉన్న "హే రామ్" అనే మాట కూడా వారికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క మున్సిపాలిటీకి ఎంత నిధులు ఇచ్చిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద నిధులు విడుదల చేసిందని గుర్తుచేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీఆరచవతీతీచస్ పార్టీ ఎక్కడా అధికారంలో లేదని, ఓటర్లు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఆమనగల్లు మున్సిపాలిటీ ఓటరు జాబితా సవరించాలి

## ఆర్డీవోకు హైకోర్టు ఆదేశం

**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీలో ఓటర్ల జాబితా లోపాలతో నిండి ఉందని పేర్కొంటూ దాఖలైన




పిటిషన్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓటరు జాబితాలో అనేక అవకతవకలు ఉన్నాయని ఆరోపిస్తూ ఓ న్యాయవాది హైకోర్టును ఆశ్రయించారు.మరణించిన వ్యక్తుల పేర్లు ఇంకా ఓటర్ జాబితాలో కొనసాగడం, కొందరికి ఒకే వార్డులో రెండు ఓట్లు ఉండటం వంటి అంశాలు నిబంధనలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ లోపాలపై తక్షణమే చర్యలు తీసుకుని ఓటర్ల జాబితాను సవరించాలని కోరారు.ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తికాగా, న్యాయస్థానం స్పందించింది. ఓటరు జాబితాలోని తప్పులను 15 రోజులలోపు సరిచేసి, సవరించిన తుది జాబితాను సమర్పించాలని కందుకూరు ఆర్డీవోకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**కరీంనగర్ రూరల్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని గుంటూరుపల్లి స్టేజి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.వివరాల ప్రకారం, బొమ్మకల్‌కు చెందిన కాశీపాక మహేష్ తన యజమాని కాశీపాక శివకుమార్ తండ్రి రాజయ్య




ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తే ఎవరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# నేదునూరి మాట

# సామాజిక న్యాయం ?

స్వరాజ్యం సిద్ధించి వజ్రోత్సవాలు జరుగుతున్న రాజ్యాంగ పీఠికలో ఘోషించిన సామాజిక న్యాయం ఆర్థిక న్యాయం? జాతికి సిద్ధించలేదు

భారత్ ఇంకా అభివృద్ధి
చెందుతున్న దేశంగా
చెలామణవుతుంది
సగటు మనిషి జీవన
ప్రమాణాలు పెరుగలేదు

ఆకలి చావులు అనారోగ్యం
అసమానతలు లింగవివక్షత
సామాజిక సంఘర్షణలు
అత్యాచారాలు లైంగిక హింస
కులమతాల కుమ్ములాటలు

పేదరికం నిరక్షరాస్యత
నిరుద్యోగం ప్రాంతీయ
అసమానతలు కుట్రలు
కుయుక్తులు నేరాలు
గోరాలు మార్కెట్ మోసాలు
అప్రతిహతంగా కొనసాగుతూనే
వున్నాయి

మహిళా సాధికారిత మాటలకే
పరిమితమైంది యువజన
సాధికారిత ఊసే లేదు

బహుజనులకు అధికారం
అందనిద్రాక్ష అయ్యింది
జనాభాలో సగభాగమైన
బిసిలు చట్టసభల్లో ప్రవేశం లేక
రాజ్యాధికారానికి నోచుకోలేదు

రాజకీయ ఆర్థిక సామాజిక
న్యాయం అగ్రవర్గాల(అగ్రవర్ణాల)
ఆదిపత్య కులాల్లో కేంద్రీకృతమైంది

సామాజిక సమానత్వం సమైక్యత
సౌభ్రాతృత్వం సంపదపంపిణీలో
వ్యత్యాసాలు వర్ధిల్లుతున్నాయి

స్థానిక సంస్థల్లో ?అధికారం ఒకరిది
పెత్తనమొకరిదై స్థానిక సంస్థల
సాధికారిత నినాదంగానే
మిగిలిపోయింది

అన్నిరంగాలలో అవినీతి
అక్రమాలు రాజ్యమేలుతున్నాయి

వజ్రోత్సవాలభారత్
నేరమయ రాజకీయాల ఉచ్చులో
చిక్కుకొని విలవిలలాడుతుంది

ఉచితాల ఉధృతిలోప్రజోద్ధరణ

మరిచిన పాలక ప్రతిపక్షాలు
రాజకీయాల కుమ్ములాటలో
సంక్షేమం సంక్షోభాల మయమైంది

తిరంగ జెండా పండుగలో
పాలకులు తరిస్తున్నపటికి
స్వాతంత్ర ఫలాలు
సామాన్యుని దరి చేరలేదు

అధికారం అందరికీ చేరువకావాలి
సమానత్వం తో వ్యక్తులు శక్తులుగా
ఎదగాలి

స్వదేశీ స్వావలంబనతో
సుస్తిరాబివృది సాధనతో
సౌభాగ్య స్వర్ణభారత్ సాధనకు
సంసిద్ధమౌదాం

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్ 9440245771



# ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా ఉప సర్పంచ్ కి ఘన సన్మానం.





**మహబూబాబాద్ జిల్లా, కురవి, జనవరి 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
కుమ్మర శాలివాహన వెల్ఫర్ ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన కుమ్మర శాలివాహన కులానికి చెందిన సర్పంచులు,ఉప సర్పంచ్లు,వార్డ్ మెంబర్లకు ఒక ఘనమైన బ్రహ్మాండమైన రాష్ట్ర స్థాయి సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులు పాల్గొన ఉత్తరప్రదేశ్ విధానం మండలి ఎమ్మెల్సీ సభ్యుల రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ వీర్ ప్రజాపతి,గుజరాత్ రాష్ట్రం మాజీ రాజ్యసభ సభ్యులు జాతీయ బిజెపి కౌన్సిలర్ సభ్యులు బిజెపి ఓబీసీ మోర్చా మాజీ జాతీయ నాయకులు దినేష్ బాయ్ అన్నహడియా, ఐపీఎస్ రిటైర్డ్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఏఐబిఎస్పి ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు ప్రజాపతి, జాతీయ వెనుకబడిన వర్గాల కమిషనర్ ఉపాధ్యక్షులు ఎన్సీబీసీ విరాట్ ఉత్తర ప్రదేశ్ ల నాయకులు హైదరాబాదులో జరిగిన కుమ్మర కులం శాలివాహన ప్రజా నాయకులు కుమ్మర రాజకీయ చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా,కొరివి మండలం నల్లెల గ్రామానికి చెందిన బిఆరఎవతీతీచస్ పార్టీ నుండి క్లీన్ స్లిప్ కొట్టిన ఉప సర్పంచ్ గా ఎన్నికైన నిమ్మలగంటి కృష్ణమూర్తి కి ఘనమైన ఆహ్వానం పలికి శాలుతో ఘన సన్మానం చేశారు.కుమ్మర శాలివాహన కులం ప్రజా ప్రతినిధులు వారి చేతుల మీదుగా స్థానిక సంస్థల ఎలక్షన్ లో గెలిచిన ప్రతి ఒక్కరికి హార్థిక శుభాకాంక్షలు తెలుపుతూ ఘన సన్మానం చేశారు.

# దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలి




**దేవరకొండ జనవరి 19. (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ పట్టణాన్ని జిల్లా గా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి సమావేశాన్ని అన్ని వర్గాల మేధావులతో కలిసి జిల్లా సాధన సమావేశం ఏర్పాటు చేయడమైనది ఈ సందర్భంగా సామాజిక ఉద్యమకారుడు దేవరకొండ జిల్లాసాధన సమితి వ్యస్థాపక అధ్యక్షులు కేతావత్ లాలు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసే ఆలోచనలు ఉన్నందున అన్ని రంగాలలో వెనుకబడిన ప్రాంతం నల్లగొండ జిల్లా కేంద్రానికి సుదూరముగా ఉన్న దేవరకొండ ను జిల్లాగా ఏర్పాటుచేయాలని ఒకప్పుడు రాజధాని కేంద్రముగా క్రిష్ణ పట్టి ప్రాంతమును పరిపాలించిన దేవరకొండను జిల్లా గా ఏర్పాటు చేయడం చాలా ముఖ్యము పరిపాలన సౌలభ్యము కోసం సుపరి పరిపాలన కోసం దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలని వెనుకబడిన ప్రాంతం అభివృద్ధికి నోచుకోనటువంటి ప్రాంతం గిరిజనులు బహుజన కులాలు అత్యధికంగా ఉన్న ప్రాంతం సాగునీరు తాగునీరు కూడ నోచుకోని దేవరకొండ ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని దీనికి శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ పూర్తి బాధ్యత తీసుకొని జిల్లాను ఏర్పాటు చేస్తే తన పేరు చరిత్రలో నిలిచిపోతది అని తక్షణమే ప్రభుత్వంతో మాట్లాడి జిల్లాను ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే ని దేవరకొండ ప్రజల పక్షాన కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో రామావత్ లాలూ నాయక్, జరుపుల లోక్య నాయక్, గాజుల రాజేష్, డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, బాలవర్ధి రాజు, సైదులు, బలరాం, రామకోటి, ఆంజనేయులు, కోటేశ్వర్, కొండ, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క- సారలమ్మ తల్లులను దర్శించుకొన్న ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.





**దేవరకొండ జనవరి 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
ములుగు జిల్లా మేడారంలో గిరిజన వనదేవతలు లిసమ్మక్క-సారలమ్మ తల్లులనులి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎ.రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు మరియు సహచర ఎమ్మెల్యేలతో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవరకొండ నియోజక వర్గ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు. అనంతరం మేడారంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యువకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### టిబి కే ప్లానర్స్ కన్స్ట్రక్షన్స్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహింపట్నం , జనవరి19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు రంగారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎంఎలచవతీతీచ నివాసంలో.మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన తేరటి భరత్ కుమార్ ఇంజనీయార్. చదివి. ఇంటి నిర్మాణ ప్లానర్గా ఎదిగడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఆయన ఆదర్శంగా తీసుకొని మరింత మంది ఉన్నత చదువులు చదివి సొంతంగా బిజినెస్ చేసుకోవాలని గుర్తు చేశారు. అనంతరం.టీబీకే ప్లానర్స్ ఉ కన్స్ట్రక్షన్స్ నూతన 2026 సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ తేరటి భరత్ కుమార్ , నాయకులు యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నరసింహ, సీనియర్ నాయకులు ఏట్టి లక్ష్మయ్య, సంగం రవి, కాల్వ. కుమార్, సందీప్, మహేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

# పాడి పశువుల గర్భకోశ వ్యాధి ఉచిత శిక్షణ శిబిరం



**వెల్దండ, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండలంలోని బర్కత్ పల్లి గ్రామంలో పాడి పశువుల గర్భకోశ వ్యాధి నివారణ, చికిత్స కోసం ఉచిత శిక్షణ పశువైద్య శిబిరం ఏర్పాటు చేయబడింది. నాగర్ కర్నూల్ జిల్లా పశుసంవర్ధక శాఖ మరియు పశు గణాభివృద్ధి సంస్థ మహబూబ్ నగర్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి.గ్రామ సర్పంచ్ మల్లికేడి నవ్య, రాజు, కేశమొళ్ళ నర్సింహా, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్య శిబిరంలో డా. శ్యామ్ సుందర్, డాడి రాజేష్ వంటి పశువైద్యాధికారులు, సిబ్బంది నరేష్ రెడ్డి, జెవిఒ నర్సింహా, విఎ గోపాలమిత్రులు బాలయ్య, సాయిబాబు, విజేందర్, మైత్రి, కె. తిర్పతయ్య పాల్గొన్నారు.

### జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన సింగరేణి సిడఎండి

**గోదావరిఖని: జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్ దిల్ కుశ గెస్ట్ హౌస్ లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ ని సోమవారం సింగరేణి ఇన్చార్జి సిఎండి డి. కృష్ణ భాస్కర్, డైరెక్టర్ (ఫా) గౌతమ్ పొట్రు మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థలో బొగ్గు ఉత్పత్తి తో పాటు ఉద్యోగుల రక్షణ, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వడ్డేపల్లి రామచందర్ కు వివరించారు.

# ఎక్కడైతే మేలు?

**. రిజర్వేషన్ అనుకూలించని ఆశవహుల అన్వేషణ -ఇతర వార్డులపై దృష్టి**





**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పురపాలక సంస్థ పరిధిలో రిజర్వేషన్ ఖరారు కొందరికి మోదం కలిగించగా, మరికొందరికి ఆవేదనను మిగిల్చాయి. ఆశించిన చోట రిజర్వేషన్ కలిసి రాని అభ్యర్థులు, ఇతర వార్డులపై దృష్టి సారించారు. ప్రధానంగా చైర్మన్ స్థానాలను ఆశిస్తున్న వారిలో కొందరికి తమ వార్డుల్లో రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో తమకు అనుకూలించే రిజర్వేషన్లు ఉన్న ప్రాంతాల్లో ఎక్కడ పోటీ చేస్తే బాగుంటుంది అని ఆరా తీస్తున్నారు. గతంలో కౌన్సిలర్లుగా వ్యవహరించి తమ ప్రాంతంలో అనుకూల రిజర్వేషన్ రాక ఉసురుమున్న నాయకులు కూడా ఈసారి వేరే వార్డుల్లో పోటీ చేయడంపై దృష్టి పెట్టారు. అప్పుడే రాజకీయ పట్టు నిలుపుకోగలుగుతామని భావిస్తూ అనుచరులతో సంప్రదింపులు చేస్తున్నారు. పురపాలికలలో పాగా వేయాలని స్థానిక నాయకులు ఇప్పటికే అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నారు. ఒక్కొక్క పురపాలిక వార్డు నుంచి పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసిన వారు, గెలుపొందే నాయకుల పేర్లు పరిశీలిస్తున్నారు. వార్డులో పోటీపడే అభ్యర్థులు నాయకుల ద్వారా టికెట్ కోసం పైరవీలు ప్రారంభించారు. పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు పట్టు సాధించిన కాంగ్రెస్ నాయకులు పురపాలికల్లో పాగవేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆశావహులు నేతల ద్వారా టికెట్ దక్కించుకునేందుకు తమదైన శైలితో మంత్రాంగం నడిపిస్తున్నారు.

# 21న విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్ట్



**ఎలిగేడు, జనవరి 19:( నీలగిరి ఎక్స్ ప్రెస్)** మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఈనెల 21న విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు ఎలిగేడు విద్యుత్ శాఖ ఏఈ సంపత్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ లోకల్ కోర్ట్ లో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లు, ఓల్టేజ్ హెచ్చుతగ్గులు డిస్ట్రిబ్యూషన్ పెంపుదల లోపాలు ఉన్న మీటర్లు మార్చడం నూతన సర్వీసులు మంజూరు చేయడం అదనపు లోడు క్రమబద్ధీకరణ సర్వీస్ పేరు మార్పు వాడకం కన్నా హెచ్ మొత్తంలో ఉన్న బిల్లులు కేటగిరి మార్పు సర్వీస్ రద్దు మొదలగు వాటి గురించి విద్యుత్ వినియోగదారులు లిఖితపూర్వకంగా తమ ఫిర్యాదులను అందించవచ్చునని ఆయన చెప్పారు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.వేణుగోపాల చారి(సి జి ఆర్ ఎఫ్-1) టీజీ ఎన్ పి డి సి ఎల్ చైర్మన్, తోపాటు రమేష్ టెక్నికల్ మెంబర్, దేవేందర్ ఫైనాన్స్ మెంబర్, రామారావు ఇండిపెండెంట్ మెంబర్ లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# ఇబ్రహింపట్నంలో ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు






**ఇబ్రహింపట్నం,జనవరి19 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )** ఇబ్రహీంపట్నం కేంద్రంలోని శాస్త్రా గార్డెన్స్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ద్వాక్రా మహిళా పొదుపు సంఘాలకు 3 కోట్ల 50 లక్షల ఋణాలు పంపిణి చేసిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రధానంగా మహిళల ఆర్థిక, సామాజిక, సాధికారతకే ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవంలా వడ్డీ లేని రుణాల పంపిణీ జరుగుతుందని చెప్పారు.. మహిళలను




మహారాణులుగా గౌరవిస్తూ, వారికి ఆర్థికంగా స్వావలంబన కల్పించేలా అనేక మార్గాల్లో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉండి ముందుకు నడిపిస్తోందన్నారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రమాద భీమా, రుణ భీమా కల్పనతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పాఠశాలలు, క్యాంటీన్లు,పెట్రోల్ బంకుల నిర్వహణ, స్కూల్ యూనిఫామ్?ల తయారీ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పనులు మహిళలకే అప్పగిస్తూ, వారికి ఉపాధిని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చెందిన అధికారులు, ఐకెపి సిబ్బంది, గ్రామ సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శిలతో పాటు డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతర పనులను పరిశీలించిన తహసిల్దార్.



**ఎలిగేడు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఎలిగేడు ,లాలపల్లె గ్రామాల పరిధిలోని పెల్లిపోరు గుట్ట వద్ద ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర పనులను సోమవారం ఎలిగేడు మండల తహసిల్దార్ యాకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జాతర కమిటీ నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు ఆయన తెలిపారు. ఆయన వెంట ,ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, లాలపల్లె సర్పంచ్ వెంకట్ రెడ్డి, జిపిఓ అనిల్ గ్రామ కార్యదర్శి అంజలి, సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షులు సాగర్ ఉపాధ్యక్షులు అడ్డగుంట రవి గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి,బాసంపల్లి వినోద్ ,కుమార్ ,సుమన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ సాయిరాం నగర్ లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్




**బోడుప్పల్, జనవరి19(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీలో సోమవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ టాయిలెట్ పరిశుభ్రతను పరిశీలించి, పర్యావరణ హితంగా మొక్కలు నాటిన డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కొందరు బాధ్యత రాహిత్యంగా రోడ్ల పక్కన చెత్త వేయడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చెత్త వేసిన వారిపై చట్టబద్ధంగా చలాన్లు విధించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రాజీవ్ నగర్ కాలనీలో చెత్త వాహనాలు ఇళ్ల దగ్గర నిలిపివేయడం వల్ల అక్కడ నివసించే ప్రజలకు అనేక వ్యాధులు వ్యాపిస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని, ఇకపై ఇళ్ల మధ్యలో చెత్తబండ్లు నిలపడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్?డబ్ల్యూ?ఎం ఏఈ మహేష్, హెల్త్ అసిస్టెంట్ వినోద్, వార్డు సూపర్వైజర్లు జడిగా శ్రీను, గుర్రాల శివ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు లువేసి మా సమస్య తీర్చండి : రవీందర్ గుప్త



**ఇబ్రహింపట్నం, జనవరి 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** యాచారం , కడ్తల్ , ఆమనగల్, మాడుగుల మండల పరిధిలోని మేడిపల్లి మాల్ , మేడిపల్లి హైదరాబాద్, మేడిపల్లి మాల్ నైట్ హాల్ట్, ముద్విన్ మాల్ , మాడుగుల , మాల్ వివిధ గ్రామాలకు వచ్చే బస్సులను కల్వకుర్తి డిపో అధికారులు కరోనా సమయంలో బంద్ చేశారు. ఆ బస్సులు పునః ప్రారంభం చేయాలని పలుమార్లు కల్వకుర్తి డిపో మేనేజర్ కి ,=వీ కు మరియు కల్వకుర్తి ఎమ్మెల్యే గారికి ఆర్టీసీ ఎండీకి గతంలో వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేదు. కల్వకుర్తి డిపో మేనేజర్ కుంటి సాకులు చెబుతూ కాలం వెల్లదిస్తున్నారని రవీందర్ గుప్త చెప్పారు. మరో మారు సోమవారం కల్వకుర్తి డిపో అధికారులకు సోమవారం బస్సులు పునః ప్రారంభం చేయాలని పత్రము అందజేశారు. డిపో మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో సూపర్డెంట్ ఠాగూర్ క్రి=+ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరు రవీందర్ గుప్తా కల్వకుర్తి డిపోలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గుప్తా మాట్లాడుతూ త్వరలో బస్సు సమస్యలు పరిష్కారం చేయకపోతే కల్వకుర్తి డిపోకు సంబంధించిన బస్సులను అడ్డుకుంటామని తెలిపారు.

# ఎండబెట్ల హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



**నాగర్ కర్నూల్, జనవరి 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం మీద ఎండబెట్ల వద్ద 10 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరైన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మరియు ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ప్రాంతీయ అభివృద్ధికి ఇది కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎంపీ డా. మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా లైబ్రరీ చైర్మన్ రాజేందర్, మార్కెట్ చైర్మన్ రమణరావు, నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవభారత అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు



**వెల్దండ, జనవరి 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని బైరాపూర్ గ్రామంలో నవభారత అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి, హైదరాబాద్ లోని తన నివాసంలో సంఘ ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. అనంతరం సంఘం యొక్క నూతన కమిటీ లెటర్ హెడ్ ను తన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తలారి నరసింహ, ఉపాధ్యక్షులు జె.కృష్ణ, టి.సత్యం, బి.సురేష్, కార్యదర్శి పి.సైదులు, కోశాధికారి జి.రాములు, సహాయ కార్యదర్శులు ఎస్.విష్ణు, జి.వెంకటేష్, జె.సైదులు, నిర్వహణ కార్యదర్శులు టి.సైదులు, జె.మల్లేష్, టి.మహేష్, సభ్యులు జె.శ్రీకాంత్, టి.శరత్, టి.తేజ, బి.శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే సలహాదారులుగా ఎన్.పెద్దజంగయ్య, టి.బాలకృష్ణ, ఎన్.చిన్నజంగయ్య, బి.బాలనరసింహ, బి.పెద్దఅంజయ్య, బి.రామస్వామి, టి.కృష్ణయ్య, జి.సాయి తిరుమల్, టి.చైతన్య, ఎస్.నరసింహ, యస్.గిరి ప్రసాద్, జి.యాదయ్య, టి.లక్ష్మయ్య తదితరులు హాజరై నూతన కమిటీకి మద్దతు తెలిపారు.

## మిర్యాలగూడలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ



**మిర్యాలగూడ, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్ర భారతి వేదికగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులు పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పట్టణంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం తనకు అన్నగా ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మహిళా ప్రభుత్వం అని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక, సామాజిక బలోపేతం జరుగుతోందని తెలిపారు. మహిళలు సమాజానికి దిక్సూచి లాంటి పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాగే స్వయం సహకార సంఘాల మహిళల కోసం ఇందిరమ్మ పేరుతో ప్రభుత్వ భూమిలో ప్రత్యేక భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ బస్టాండ్ ను త్వరలోనే డిజిటల్ బస్టాండ్ గా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్న ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్నాహాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వెల్దండలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ

**వెల్దండ, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



వెల్దండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రవీందర్ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ ఘనంగా జరిగింది. పాఠశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు ఊరేగింపుగా పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించి, క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శరీర దారుఢ్యాన్ని పెంచుతాయని, విద్యార్థులు క్రీడల ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పీడీ జాను, పీఈటి మమత, పెద్దాపూర్ పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు అమర్ సింగ్, కమలేకర్ నాగేశ్వర్ రావు, చంద్రశేఖర్, రేణుక, విజయనిర్మల, దానయ్య, అశోక్ పాల్గొన్నారు. అదేవిధంగా ఉప సర్పంచ్ బసన్మోని శ్రీను, నాగర్ కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యెల పుల్లయ్య, ఎండి రషిద్, మండల యూత్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, రాహుల్ నాయక్, గ్రామ యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ వారి సేవలు ప్రశంసనీయం

### ఆమనగల్లు సీఐ జానకిరామ్ రెడ్డి




**ఆమనగల్లు, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రాంరెడ్డి లయన్ విజన్ సెంటర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి తో కలిసి ఆమనగల్ సీఐ జానకిరామ్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ వారి సేవలు ప్రశంసనీయమని వారు కొనియాడారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి చూపు మందగించడం వారికే ఆపరేషన్ చేయించి వారిని తిరిగి తీసుకురావడం చాలా గొప్ప సేవ అని ఆయన అన్నారు. క్లబ్బు ఆధ్వర్యంలో చేపట్టే వైద్య,ఆరోగ్య శిబిరాలను నిరుపేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు నేత్ర దానం చేసి, మన ఇద్దరికీ దృష్టి భాగ్యం కల్పించాలని అన్నారు. నేత్రదానం మహాదానం ఒకరి నేత్రదానం ఇద్దరి అందులకు చూపు ప్రధానం అని ఆయన అన్నారు. శిబిరంలో కంటి వైద్యులు చంద్రశేఖర్120 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందిని ఐఓఎల్ ఆపరేషన్ నిమిత్తం రాం రెడ్డి లయన్స్ హాస్పిటల్ కు తరలించినట్లు క్లబ్ పిఆరచవతీతీచ పాషా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,క్లబ్ ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య,జూలూరు రమేష్, క్లబ్ సభ్యులు కొరివి వెంకటయ్య, క్లబ్ పిఆరచవతీతీచ పాషా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నీలగిరి ఎక్స్ప్రెస్ దినపత్రిక

# వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ



**హైదరాబాద్,జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నీలగిరి ఎక్స్ప్రెస్ దినపత్రిక వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్?లోని కర్మంఘాట్?లో ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఈ క్యాలెండర్ ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీలగిరి ఎక్స్ప్రెస్ దినపత్రిక ప్రజా సమస్యలను ప్రతిబింబించే అద్భుతమైన కథనాలతో పాఠకుల విశ్వాసాన్ని సంపాదించుకుందని ప్రశంసించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై నిర్భయంగా ప్రశ్నిస్తూ, ప్రజల తరపున పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్న పత్రికగా నీలగిరి ఎక్స్ప్రెస్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో పత్రిక సంపాదకుడు కండె వెంకట్, నిర్వాహకులు సామల సాయికిరణ్, బొజ్జా నిఖిల్ పాల్గొని క్యాలెండర్ విశేషాలను వివరించారు. అలాగే ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందే సురేష్, ఫరూక్?నగర్ మండల అధ్యక్షుడు ఎల్కుర్తి నారాయణ, కరీంనగర్ గౌరవ అధ్యక్షుడు హన్మారి మురళీధర్, రంగారెడ్డి జిల్లా యువజన సంఘం కోశాధికారి, సామాజిక కార్యకర్త నీల రవీందర్ తదితర ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తుల

# సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ డి. వేణు



**పెద్దపల్లి, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతనిచ్చి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి. వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించిన ఆయన, అప్పన్నపేట గ్రామానికి చెందిన చీకటి పోచాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. శ్రీలత, మాజీ కార్యదర్శి పి. శ్రీనివాస్ నిధుల దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారికి రాసి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో మంజూరైన 33 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని భారాస పార్టీ అధ్యక్షుడు రమేష్ ఫిర్యాదు చేయగా, పీడీ హౌసింగ్‌కు రాసి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దపల్లి పట్టణం చింతలవాడకు చెందిన ఎం.డి. వాజిద్ అలీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరిన దరఖాస్తుపై పెద్దపల్లి ఆర్‌డీఓకు రాసి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఇస్రో శాస్త్రవేత్త, గ్రూప్-3

# విజేతలకు ఘన సన్మానం



**రాజన్న సిరిసిల్ల ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఇస్రోలో ఉద్యోగం సాధించిన చోక్కయ్య సాయి చరణ్, అలాగే గ్రూప్-3 ఉద్యోగం సాధించిన గుడికాడి నాగరాజును ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి శాలువాలు కప్పి, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మంచి ఆరోగ్యంతో మరింత ఉన్నత స్థాయిలో నిలవాలని శ్రీరామచంద్రుల వారిని కోరుకుంటున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, ముస్తఫా నగర్ సర్పంచ్ బండ సుకన్య దేవయ్య, నాయకులు పత్తి స్వామి, కిషన్ రావు, డాక్టర్ సత్యనారాయణ, సర్వోత్తమ్, దేవేందర్ యాదవ్, నర్సింలు, శ్రీనివాస్ చారి, నరేష్, రమేష్, భాస్కర్ నాయక్, ప్రశాంత్ రావు, నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు. యువత విజయాలను గుర్తించి సన్మానించడం స్థానికంగా ఉత్సాహాన్ని కలిగించింది.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ శక్తి చాటాలి

**- గంగాడి కృష్ణారెడ్డి**



**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
త్వరలో జరగబోయే హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగర వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హుజురాబాద్ మున్సిపాలిటీ బీజేపీ నేతల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ మున్సిపాలిటీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయని విమర్శించారు. గడచిన రెండేళ్లలో రేవంత్ రెడ్డి సర్కార్ మున్సిపాలిటీలకు నిధులు కేటాయించలేదని, ప్రస్తుతం జరుగుతున్న పనులు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపాలిటీల అభివృద్ధి కేవలం మోడీ ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రజలు గమనించాలని కోరారు. హుజురాబాద్ పట్టణ రూపురేఖలను మార్చే బాధ్యత బీజేపీ తీసుకుంటుందని, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సహకారంతో హుజురాబాద్ మున్సిపాలిటీని ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని, అధికారంలో లేని బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయడం దండగ అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను పట్టణ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఎన్నికల ఇన్చార్జి ఎర్రం మహేష్, పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, ఎన్నికల కన్వీనర్ యాంసాని శశిధర్, జిల్లా ప్రతినిధి మాసాడి ముత్యంరావు, జిల్లా పదాధికారులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి శ్రేణులు ఉత్సాహంగా పనిచేయాలని నాయకత్వం స్పష్టం చేసింది.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**బెజ్జంకి ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల అభివృద్ధే ఏకైక లక్ష్యంగా సర్పంచులు పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. సోమవారం బెజ్జంకి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో కె. ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సర్పంచులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సర్పంచులు రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి, వార్డు సభ్యులతో కలిసి గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాల పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సర్పంచులకు సంపాదన కాకుండా ప్రజల మెప్పు పొందడమే ముఖ్యమని, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే విధంగా మంచి పనులు చేయాలని ఉద్బోధించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సర్పంచులు తోడ్పడాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కళ్యాణం శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి మంజుల, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సౌజన్యతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలలో బీసీలకు ఆదరణ కరువు రవీందర్ గౌడ్




**హుస్నాబాద్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలలో బీసీలకు సరైన ఆదరణ లేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లను సర్పంచ్ ఎన్నికల్లో, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా విస్మరించడం బీసీలను అవమానపరిచే చర్య అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానంపై బీజేపీ, బిఆర్ఎస్ కూడా మౌనంగా ఉండటం బీసీలను అణగద్రొక్కే ప్రయత్నమేనని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటులో రిజర్వేషన్లు పెంచి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని కనీసం అడగని పరిస్థితి ఈ పార్టీల వైఖరిని స్పష్టంగా చూపుతోందని అన్నారు. బీసీల డిఎన్ఏ ఉన్న ఏకైక పార్టీ బీఎస్పీ అని, బహుజనల సమస్యలను పట్టించుకునేది ఈ పార్టీ మాత్రమేనని రవీందర్ గౌడ్ తెలిపారు. గతంలో కాన్షిరాం, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, లల్లు ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ వంటి నాయకుల పోరాటం వల్లే విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో రాజ్యాంగ సవరణలు జరిగాయని గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలను అణగద్రొక్కే పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఉత్తరాల ద్వారా గవర్నర్‌కు చేరిక



**హుస్నాబాద్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన ఉత్తరాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సోమవారం పోస్ట్ చేశారు. కార్మికులు మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇవాల్సిన రెండు పీఆర్సీలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి అపాయింట్మెంట్ డే ప్రకటించి, ఉద్యోగ భద్రత కల్పించాలని గవర్నర్ చొరవ చూపాలని కోరారు. చిన్న చిన్న కారణాలతో సస్పెన్షన్లు ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బి. మహేందర్, వి. రామ్మోహన్ రెడ్డి, ఎం. పరమేశ్వర్, ఆర్. సుధాకర్, కె.ఎస్. చారి, ఎస్.ఆర్. కృష్ణ, విజయ్, కార్మికులు పి.యస్. రెడ్డి, బాబా, మోహన్, పిఎస్కే స్వామి, రాజీ రెడ్డి, కె.ఎల్. చారి తదితరులు పాల్గొన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

# సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ

**మాడుగుల, జనవరి 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సంక్రాంతి పండుగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహిళామూర్తుల కోసం ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. సంస్థ చైర్మన్ నరేష్ దండు స్వగ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, రాజకీయ నాయకులు, యువకులు విశేషంగా సహకరించారు. సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగైపోతున్న తరుణంలో వాటిని పరిరక్షించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని నరేష్ దండు తెలిపారు. విజేతలకు రూ.5000, రూ.3000, రూ.2000 బహుమతులు అందజేసి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి చీర కానుక ఇచ్చారు.



# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**హుస్నాబాద్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలం పూల్ నాయక్ తండ గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి బర్మావత్ మనోహర్ (27) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మనోహర్ ఇంజనీరింగ్ పూర్తి చేసి అమెరికాలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేసి, మూడు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అనంతరం హైదరాబాద్‌లో సొంతంగా సాఫ్ట్వేర్ కంపెనీ నడుపుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన మనోహర్, హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్తూ సబ్‌స్టేషన్ సమీపంలో తన బైక్ అదుపుతప్పి కరెంటు పోలుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తక్షణమే 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

## జాతీయ ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కరీంనగర్ రూరల్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగునూరు గ్రామానికి సంబంధించిన జాతీయ ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు గ్రామ సభ వద్ద నిరసన తెలిపారు. మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిల్ల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పాల్గొన్న వారు, నిధులను దుర్వినియోగం చేసిన మాజీ కార్పొరేటర్‌తో పాటు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రికవరీ చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ కొమరయ్య, మండల సెక్రటరీ తాండ లక్ష్మణ్, గజ్జల మహేష్, ఎండి షఫీ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు నిధుల దుర్వినియోగంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, పారదర్శకతతో అభివృద్ధి జరగాలని కోరారు.


# సీఎం కప్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ అశ్వినీ తనజీ వాకడే**




**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: సీఎం కప్ పోటీలను పురస్కరించుకొని ఈరోజు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ అశ్వినీ తనజీ వాకడే అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం కప్ పోటీలను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ పవన్ కుమార్, జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ వేణుగోపాల్, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఎస్‌జిఎఫ్ సెక్రటరీలు, బీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు అని జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి తెలిపారు. ఈ సమావేశం ద్వారా సీఎం కప్ పోటీలను సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకాలు ఇవ్వబడ్డాయి.

## మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**హుజురాబాద్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ పెరుగుతోంది. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో జమ్మికుంట పట్టణ సీనియర్ డాక్టర్ సురంజన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణవ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆయనను ఆహ్వానించారు. కాంగ్రెస్ అంటే పేదల పార్టీ, ఇలాంటి పార్టీలో చేరడం అదృష్టంగా భావిస్తున్నానని డాక్టర్ సురంజన్ పేర్కొన్నారు. ప్రణవ్ మాట్లాడుతూ, హుజురాబాద్‌జమ్మికుంట మున్సిపాలిటీల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రజల్లో మమేకమవుతూ పార్టీ పథకాలను అందజేస్తున్న తన నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలపడుతుందని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ పీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని డాక్టర్ సురంజన్ ధీమా వ్యక్తం చేశారు.

## హిందూ స్మశాన వాటికల అభివృద్ధి కరువు





**గోదావరిఖని ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోదావరిఖని, గోదావరి పరిసర ప్రాంతాల్లోని హిందూ స్మశాన వాటికలు ప్రభుత్వాలు మారినా అభివృద్ధి నోచుకోకపోవడం వల్ల అంతిమయాత్రకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు సరిగా లేకపోవడం, కంకర రాళ్లపై చెప్పులు లేకుండా నడవడం వల్ల గాయాలు అవుతున్నాయని, విద్యుత్, నీటి సౌకర్యాలు లేకపోవడం, చెత్తాచెదారుతో నిండిపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ స్మశాన వాటికలు అభివృద్ధి నోచుకోలేదని ఆయన విమర్శించారు. పేరుకే కార్పొరేషన్ ఉన్నా అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చొరవ చూపి స్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, టాయిలెట్స్, లైటింగ్, భద్రతా సిబ్బంది, శుభ్రతతో పాటు పూల మొక్కలు నాటే చర్యలు చేపట్టాలని కోరారు. అంతిమయాత్రలకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

## అభివృద్ధికి భారీ నిధులు కేటాయింపు

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కొత్త చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం ఇరిగేషన్ శాఖ నుండి రూ.7.49 కోట్ల పరిపాలన అనుమతులు, ఎల్లమ్మ చెరువు అడ్డుకట్ట మరియు నీటిపారుదల కాలువల పునరుద్ధరణకు రూ.2.74 కోట్ల పరిపాలన అనుమతులు జారీ అయ్యాయి. కొత్త చెరువు అభివృద్ధి, ఎల్లమ్మ చెరువు కాలువల పునరుద్ధరణకు భారీగా నిధులు కేటాయించడం పట్ల హుస్నాబాద్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిధులు కేటాయించినందుకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. హుస్నాబాద్ అభివృద్ధిలో ఇది మరో కీలక మెట్టుగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టం పై బీజేపీ నేతల స్పష్టీకరణ




**కరీంనగర్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వీబీజీ రామ్ జీ చట్టం ద్వారా కనీస వేతనాలకు పూర్తి రక్షణ లభిస్తుందని, పాత ఎంజీఎన్ఆర్జీఏ చట్టాన్ని నీరుగార్చడం కాదని, మెరుగైన ఫలితాల కోసం మోదీ సర్కార్ చేపట్టిన దిద్దుబాటు చర్య అని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ కుమార్ బోనేటి తెలిపారు. కరీంనగర్ రైకుర్తిలో జరిగిన జిల్లా కార్యాలయ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడుతూ, ఈ చట్టం గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల బలోపేతం, పంచాయతీ రాజ్ వ్యవస్థల భాగస్వామ్యం ద్వారా వికేంద్రీకృత ప్రణాళికను బలోపేతం చేస్తుందని అన్నారు. కనీస వేతనాలు తగ్గుతాయన్న ఆందోళనలను తోసిపుచ్చుతూ, కొత్త చట్టం కింద 125 రోజుల ఉపాధి హామీతో పాటు నిరుద్యోగ భత్యం నిబంధనలను మరింత బలోపేతం చేశారని వివరించారు. గ్రామ పంచాయతీలు స్వయంగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి, కనీసం 50 శాతం పనులను నేరుగా అమలు చేస్తాయని, ఇది స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధిని నిర్ధారిస్తుందని చెప్పారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఈ చట్టంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు అపోహలకు గురికాకుండా వాస్తవాలను గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణరావు, రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కన్నబోయిన ఓదెలు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరాచారి, గుర్రాల వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్




**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు ఇంకా బకాయిగా ఉన్నాయని, వెంటనే చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారికి తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) వినతి పత్రం సమర్పించింది. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ, కొత్త సర్పంచులు బాధ్యతలు చేపట్టినా చెక్ పవర్స్, సిగ్నేచర్లు, స్టాంపులు పూర్తి కాకపోవడం వల్ల కార్మికులు సంక్రాంతి పండుగ సమయంలో కూడా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమ్మక్కసారలమ్మ జాతర సమీపిస్తున్నా వేతనాలు అందక కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆన్లైన్లో పేర్లు నమోదు కాని కార్మికులకు 9 నెలల నుండి 16 నెలల వరకు వేతనాలు బకాయిగా ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కాష్పాక శంకర్, కోశాధికారి ఎండిగ రవీందర్ రావు, కమిటీ సభ్యులు ఎలకపల్లి సారయ్య, మహంకాళి కొమరయ్య, పోతుల రమేష్, వడ్లూరి లక్ష్మీనారాయణ, గాజర్ల రాజు, జనార్ధన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెకు పిలుపు. సిఐటియు జిల్లా కార్యదర్శి గిట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, లేబర్ కోడ్స్, వీబీరామ్ జీ చట్టం, విద్యుత్ సవరణ బిల్లుల రద్దు కోసం ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత 11 సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా హక్కులను కాలరాయుతూ కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు ఇచ్చిందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వర్ల రాజు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే వికసిత్ భారత్ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలపై భారం పెంచే విధానాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి అజయ్, సిఐటియు నాయకులు ఎడ్ల రమేష్, జి. రాజేశం, జనగామ రాజమల్లు, రైతు సంఘం నాయకులు సిహెచ్. రాములు, సంపత్ రావు, జనార్ధన్ రెడ్డి, మాతంగి శంకర్, రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల వేతన సమస్యలతో పాటు, జాతీయ స్థాయి సమ్మెకు జిల్లాలో ఉత్సాహం పెరుగుతోంది.

## మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరం





**కరీంనగర్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : కరీంనగర్ పట్టణంలోని గణేష్ నగర్ 57వ డివిజన్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కూర మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఇసిజి పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించగా, 200 మందికి పైగా ప్రజలు చికిత్స పొందారు. ఈ కార్యక్రమంలో కూర సుజాత మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ బూత్ అధ్యక్షులు కోట్ర తిరుమల్, కొత్తకొండ అరుణ్, గోలి సురేష్, ఎడ్ల విక్రమ్ రెడ్డి, శ్రీ యజ్ఞ గౌడ్, నాయకులు శంకర్, పిట్ల స్వామి, కిరణ్, శ్రీసాయి గౌడ్, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లోకేష్, అబ్దుల్ వారిస్, సంతోష్, శ్రీకాంత్, గట్టు శ్రావణి, హారిక, అంజలి, సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉచిత కంటి తనిఖీ శిబిరం కూర సుజాత మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ టీం సౌజన్యంతో గణేష్ నగర్ 57వ డివిజన్‌లో ఉచిత కంటి తనిఖీ శిబిరం కూడా నిర్వహించారు. 100 మందికి పైగా ప్రజలకు కంటి దగ్గరదూరం లోపాలు, కంటి శుక్లాలు, టెర్జియం, లాసిక్, గ్లూకోమా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కూర సుజాత మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీకి అవకాశం ఇస్తే గణేష్ నగర్ 57వ డివిజన్‌లో కాషాయ జెండా ఎగురవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఈ శిబిరాలు విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## టీబీ రోగులకు రెడ్ క్రాస్ సొసైటీ చేయూత



**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 20 మంది టీబీ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్ అందజేశారు. ఇందులో ఆరు రకాల ఆహార పదార్థాలు, 30 గుడ్లు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవ రెడ్డి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, సెక్రటరీ ఊట్కూరి రాధకృష్ణా రెడ్డి, ట్రెజరర్ పొరెడ్డి శ్రీహరి రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, ఎలగందుల మున్నిందర్, దోమకొండ కృష్ణమూర్తి, టీబీ హాస్పిటల్ ఇంచార్జ్ డాక్టర్ అశోక్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. పోషకాహారంతో రోగుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.

## శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికై విరాళం



**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం నాయిని చంద్రయ్య ఒక లక్ష నూట పదహారు రూపాయల విరాళాన్ని అందజేశారు. తన తల్లిదండ్రులు నాయిని ఆగయ్యలక్ష్మి జ్ఞాపకార్థంగా ఈ విరాళం ఇచ్చిన ఆయన, ఈ పాఠశాలలో చదవడం తన జీవితానికి బంగారు బాటగా మారిందని, అన్ని రంగాలలో పురోగతికి దోహదపడిందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళికి విరాళాన్ని అందజేసిన సందర్భంగా, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, తాటి రాజేశ్వర్ రావు, రాపర్తి శ్రీనివాస్ తదితర కమిటీ సభ్యులు నాయిని చంద్రయ్యను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి ఈ విరాళం తోడ్పడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## సంక్షేమ పథకాలలో మహిళా సంఘాలకు మొదటి ప్రాధాన్యత



**పెద్దపల్లి, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. మొత్తం ఒక కోటి మూడు లక్షల రూపాయలు పైగా 490 సంఘాల అకౌంట్లలో జమ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీట వేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలనే దిశగా ముందుకు వెళు న్నామని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేసి జీరో వడ్డీ రుణాలు ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పేర్ల మీదనే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రైతు బోనస్, రుణమాఫీ వంటి పథకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యూటిషియన్ కోర్సుకు ఆహ్వానం




**హుస్నాబాద్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యూటిషియన్ శిక్షణా కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఈ కోర్సు రెండు నెలలపాటు కొనసాగుతుందని, ఫీజు రూ.1500/-గా నిర్ణయించారని చెప్పారు. ఈ శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. జనవరి 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, కనీసం 18 ఏళ్లు వయసు కలిగి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన మహిళలు అర్హులని తెలిపారు. నిపుణులచే బోధన ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్నవారు కళాశాలలో లేదా కోర్సు కన్వీనర్ జి. విజయను 9949439039 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఇసుక మాఫియాను రూరల్ పోలీసుల పట్టివేత



**కరీంనగర్ రూరల్ ,జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు, మూడు బొలెరో వాహనాలను సీజ్ చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వివరాల ప్రకారం, సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్, రాజ్ మహ్మద్, షేక్ సల్మాన్, షేర్ అలీ, షేక్ చాంద్ తమ బొలెరో వాహనాల్లో మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి సంచుల్లో నింపి అధిక ధరలకు అమ్మేందుకు తరలిస్తుండగా చెర్లబుత్కూర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నగునూరు గ్రామానికి చెందిన కుంచం రఘు, కిసాన్ నగర్‌కు చెందిన పండుగ అనిల్ ట్రాక్టర్లలో అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా తీగలగుట్టపల్లి రైల్వే గేటు వద్ద పట్టుబడ్డారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన కాశీపాక మహేష్, కాశీపాక శివకుమార్ కూడా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా గుంటూరుపల్లి స్టేజి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం మూడు బొలెరోలు, మూడు ట్రాక్టర్లు సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. తొమ్మిది మందిని ఎం.ఆర్.ఓ ముందు హాజరు పరచి ఒక్కొక్కరికి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశారు. రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తపల్లి ప్రజా కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు గూడూరి శారదమురళి (56వ డివిజన్), పెద్దపల్లి రజనీరవీందర్ (45వ డివిజన్) కాంగ్రెస్‌లో చేరగా, రాజేందర్ రావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధిస్తుందని, మేయర్ పీఠాన్ని దక్కించుకొని కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని, బిజెపిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై రోజురోజుకు కాంగ్రెస్‌లో చేరికలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్లు గూడూరి శారదమురళి, పెద్దపల్లి రజనీరవీందర్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాజేందర్ రావు నాయకత్వం ఆకర్షణగా మారి కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్ష మల్లేశం, నగర కాంగ్రెస్ ప్రతినిధి పోరండ్ల రమేష్, నాయకులు అనంతుల రమేష్, గాలిపల్లి కుమారు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలను ప్రత్యేక అధికారులు సందర్శించాలి

## కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : జిల్లాలోని ప్రతి పాఠశాలను ప్రత్యేక అధికారులు సందర్శించి మౌలిక వసతులు, విద్యా సన్నద్ధత, ఇతర అంశాలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమానంతరం అధికారులతో సమావేశం నిర్వహించిన ఆమె, ఈ నెలాఖరులోపు అన్ని పాఠశాలలను పరిశీలించాలని సూచించారు. పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక తరగతులు, ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు, విటమిన్ గార్డెన్ల నిర్వహణ, ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు, మధ్యాహ్న భోజనం నాణ్యత, టాయిలెట్‌తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి అవసరాలను నివేదించాలని ఆదేశించారు. జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని నిల్వ చేసే నిర్మాణాల ఫోటోలను జిపిఎస్ ద్వారా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేయాలని, సాయంకాలం తరగతులు, విటమిన్ గార్డెన్ల నిర్వహణను ప్రత్యేక అధికారులు పరిశీలించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు క్లబ్బుల పనితీరును కూడా పరిశీలించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 250 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. వాటిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలిసి పరిశీలించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు.

## తపస్ రాష్ట్ర కమిటీలో కరీంనగర్ జిల్లా ఉపాధ్యాయులకు స్థానం



**కరీంనగర్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాదులోని కేశవ మెమోరియల్ స్కూల్లో రాష్ట్ర అధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించిన అనంతరం 202528 సంవత్సరాలకు గాను రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో కరీంనగర్ జిల్లాకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు స్థానం పొందారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పైడిపల్లి ఉదయ్ కిరణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కనకోటి హరిచరణ్, ఓరుగంటి కర్ణాకర్ రావు, ప్రతికంఠం వినయధర్ రాజు, బూట్ల పవన్ కుమార్ ఎంపికయ్యారు. తపస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్యలు సంయుక్త ప్రకటనలో వీరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో పెండింగ్ బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా వెంటనే చెల్లించాలని, అన్ని డి.ఏలను ప్రకటించి పి.ఆర్.సి అమలు చేయాలని, ఎన్ఈపి 2020 జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని, రిటైర్డ్ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని, 2010 కంటే ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘటన మంత్రి కే. హనుమంతరావు, ఏబిఆర్ఎస్ఎం ప్రతినిధులు పాలేటి వెంకట్రావు, ఐల్నేని నరేందర్ రావు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో రంగాపూర్ జాతరలో ప్రార్థనలు చేశారు.

**అమ్రాబాద్, జనవరి 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగాపూర్ హజ్రత్ సయ్యద్ నిరంజన్ షావలి జార్త లు ఉత్సవం రెండవ రోజు ఘనంగా జరిగింది. కుల, మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. రాత్రి నిర్వహించిన ఖావాలి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను అలరించింది. 121వ సంవత్సరంగా జరుగుతున్న ఈ జాతరలో మైనార్టీ సోదరులు, వివిధ వర్గాల ప్రజలు ప్రత్యేక మొక్కులు చెల్లించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా ఆఖాఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ సిరాజ్, దర్గా కమిటీ చైర్మన్ మొహమ్మద్ రఫీ, అమ్రాబాద్ కమిటీ



అధ్యక్షులు దస్తగీర్, అక్బాల్, షమీం అహ్మద్, గౌస్, ఫయాజ్, గంధం కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్, యువకులు, మహిళలు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జాతర వాతావరణం ఇలాగే కొనసాగాలని భక్తులు ఆకాంక్షించారు.

# బంగారం ధరలపై బ్యాడ్‌న్యూస్..
## ఒకేసారి ఎవరూ ఊహించని రీతిలో పెరిగిన రేట్లు..

బంగారం కొనుగోలు చేసేవారికి బిగ్ షాక్ తగిలింది. గోల్డ్ రేట్లు భారీగా పెరిగాయి. ఒకేసారి ఏకంగా రూ.2 వేల వరకు పెరిగింది. ఒకేసారి రూ.2 వేలు పెరగడంతో బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి చేదువార్తగా మిగిలింది. ఆదివారంతో పోలిస్తే సోమవారం గోల్డ్ రేట్లు భారీగా పెరిగాయి. ఇక బంగారంతో పాటు వెండి రేట్లు కూడా అమాంతంగా పెరిగాయి. తులం బంగారం ఏకంగా రూ.లక్ష 45 వేల మార్క్ దాటగా.. కేజీ వెండి రూ.3 లక్షల మార్క్ క్రాస్ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు సోమవారం ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

బంగారం ధరలు ప్రాంతాల వారీగా

–హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,45,690కు చేరుకుంది. నిన్న ఈ ధర రూ.1,43,780గా ఉండగా.. నిన్నటితో పోలిస్తే రూ.1,910 పెరిగింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు ఆదివారం రూ.1,31,800గా ఉండగా.. సోమవారం నాటికి రూ.1,33,850కి చేరుకుంది. నిన్నటితో పోల్చి చూసుకుంటే రూ.1750 పెరిగింది

–విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,690గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,33,550 వద్ద కొనసాగుతోంది



–ఇక చెన్నైలో చూస్తే 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ.1,46,730 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,34,500గా ఉంది. నిన్నటితో చూస్తే ఏకంగా రూ.1860 పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,34,500గా ఉంది. ఆదివారం ఈ ధర రూ.1,32,800గా ఉండగా.. రూ.1700 మేర పెరిగింది

–బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,45,690గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,43,780గా ఉంది. ఇక 22 క్యారెట్ల చూస్తే రూ.1,33,550గా ఉంది

–ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,840 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,33,700గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.1910 పెరిగింది

వెండి ధరలు ఎంతంటే..?

–ఢిల్లీలో కేజీ వెండి ధర రూ.3,05,000 వద్ద కొనసాగుతోంది. నిన్న రూ.2,95,000గా ఉండగా.. ఈ రోజు రూ.10 వేలు పెరిగింది

–హైదరాబాద్‌లో కేజీ వెండిపై రూ.8 వేలు పెరిగింది. ఆదివారం రూ.3,10,000గా ఉండగా.. ఇవాళ రూ.3,18,000కి పెరిగింది. విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి


–ఇక చెన్నైలో కేజీ వెండి ధర రూ.3,18,000 వద్ద కొనసాగుతోంది. నిన్న రూ.3,10,000గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.8 వేల మేర పెరిగింది

–బెంగళూరులో కేజీ వెండి ధర రూ.3,05,000 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.2,95,000 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేసింది

–గత ఏడాది 2025 జనవరి 20న కేజీ సిల్వర్ ధర రూ.1,04,00గా ఉండగా.. 2026 జనవరి 19 నాటికి 3 లక్షలకు చేరుకుంది. అంటే ఏడాదిలో రెండు లక్షల మేర వెండి ధర పెరిగింది

# బిజినెస్

## ఇంటర్నేషనల్ మార్కెట్ల నెగెటివ్ ఇంపాక్ట్..
### నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్‌లు



అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు ఎదురుకావడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. త్రైమాసిక ఫలితాల్లో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అదే సూచీలపై ఒత్తిడి పెంచింది. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలుపని యూరోపియన్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది.బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఉదయం 83,494.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,570.35) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,898.31 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 324.17 పాయింట్ల నష్టంతో 83,246.18 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 90.91గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, ఐసీఐసీఐ, ఎటర్నెల్, టైటాన్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండిగో, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.57 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,667 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బంగారంపై ఇన్వెస్ట్ చేసేవారికి అలెర్ట్

బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో, గతేడాది సుమారు 80% రాబడిని అందించింది. దీంతో అనేక మంది బంగారంపై తమ పెట్టుబడులను పెంచుకుంటున్నారు. అయితే, బంగారంపై పెట్టుబడుల విషయంలో సరైన అవగాహన లేకపోతే పన్నుల రూపంలో 30 నుంచి 50 శాతం వరకు నష్టపోయే ప్రమాదం ఉంది. బంగారంపై పెట్టుబడి అంటే కేవలం నగలు లేదా నాణేలు కొనడం మాత్రమే కాదు. ప్రస్తుతం బంగారు ఈటీఎఫ్ లు, డిజిటల్




బంగారం, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రతి పెట్టుబడి మార్గానికి దాని స్వంత పన్ను నిబంధనలు ఉన్నాయి. ఉదాహరణకు, సావరిన్ గోల్డ్ బాండ్లు మెచ్యూరిటీ తర్వాత పన్ను రహితంగా ఉంటాయి, కానీ వార్షిక వడ్డీపై పన్ను వర్తిస్తుంది. గోల్డ్ ఈటీఎఫ్ లు, మ్యూచువల్ ఫండ్స్ లో 12 లేదా 24 నెలల తర్వాత విక్రయిస్తే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (20%) వర్తిస్తుంది.

# స్పోర్ట్స్

## గుజరాత్ మళ్లీ తడబడింది..
### ఐదో విజయంతో ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీ..!

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తున్న బెంగళూరు.. రెండో దఫాకూడా గుజరాత్ జెయింట్స్‌ను బెంబేలెత్తించింది. 178 పరుగుల ఛేదనలో సయాలీ సత్ఘరే(21 -3) విజృంభణతో గుజరాత్ టాపార్డర్ కుప్పకూలింది. ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వడంతో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 117కే పరిమితమైంది. 61 పరుగుల తేడాతో జయభేరి మోగించిన మంధాన బృందం దర్జాగా ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టింది.డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్ దిశగా అడుగులు వేస్తోంది. టాప్ గేర్ ఆటతో ప్రత్యర్థులను వణికిస్తున్న ఆర్సీబీ ఐదో విక్టరీతో ప్లే ఆఫ్స్ చేరింది. ఈ సీజన్‌లోనాకౌట్ దశకు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. సోమవారం వడోదరలో గౌతమీ నాయక్(73) అర్ధ శతకంతో 178 రన్స్ చేసిన బెంగళూరు.. మరోసారి గుజరాత్‌ను చిత్తుగా ఓడించింది. భారీ ఛేదనకు దిగిన గుజరాత్‌కు షాకిస్తూ ఓపెనర్ బేత్ మూనీ(3)ని బౌల్డ్ చేసిన సయాలీ సత్కరే(2-16).. ఐదో బంతికి సోఫీ డెవినె(0)ను వెనక్కి పంపింది.ఆ తర్వాతి ఓవర్లో కనికా





ఆహుజా(0)ను లారెన్ బెల్ డకౌట్‌గా పెవిలియన్ పంపింది. దాంతో.. 5 పరుగులకే గుజరాత్ మూడు బిగ్ వికెట్లు కోల్పోయింది. అనుష్క శర్మ(18) సైతం విఫలమైంది. కెప్టెన్ అష్లీ గార్డ్‌నర్(54) అర్ధ శతకంతో పోరాడినా.. ఆమెకు తోటి బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. ఆర్సీబీ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. గుజరాత్ బ్యాటర్లు తోకముడిచారు. దాంతో.. గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 117కే పరిమితమైంది.

గౌతమీ నాయక్ దంచేయగా

టాస్ ఓడిన ఆర్సీబీకి షాకిస్తూ గుజరాత్ జెయింట్స్ బౌలర్లు ఆరంభంలోనే వికెట్లు తీసినా ఆర్సీబీ భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(1)ను మొదటి ఓవర్లోనే రేణుకా సింగ్ వెనక్కి పంపింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే డేంజరస్ జార్జియా వోల్(1)ను కష్వీ గౌతమ్ క్లీన్ బౌల్డ్ చేసింది. దాంతో.. పరుగులకే ఆర్సీబీ విధ్వంసక ప్లేయర్లు డగౌట్ చేరారు. అనంతరం కెప్టెన్ స్మృతి మంధాన(26), గౌతమీ నాయక్(73) లు కీలక భాగస్వామ్యం నిర్మించారు. మంధానను ఎల్బీగా ఔట్ చేసిన గార్డ్‌నర్ ఈ ఈ జోడీని గార్డ్‌నర్ విడదీసింది.

ఆ తర్వాత రీచా ఘోష్(27) జతగా ఆర్సీబీ స్కోర్ బోర్డును నడిపించిన గౌతమి హాఫ్ సెంచరీ సాధించింది. కాసేపటికే రీచా పెద్ద షాట్ ఆడబోయి బౌండరీ వద్ద గార్డ్‌నర్ చేతికి క్యాచ్ ఇచ్చింది. అనంతరం రాధా యాదవ్(17) డెవినె ఓవర్లో భారీ సిక్సర్‌తో స్కోర్ 160 దాటించింది. కష్వీ వేసిన ఆఖరి ఓవర్లో తొలి బంతినే కవర్స్‌లో రాధ బౌండరీకి పంపింది. రెండో బంతికి ఫోర్ బాదిన తను ఔటయ్యాక వచ్చిన శ్రేయాంక పాటిల్(8 నాటౌట్) స్వీప్ షాట్‌తో ఫోర్ సాధించగా 17 రన్స్ వచ్చాయి. ఫలితంగా ఆర్సీబీ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 కొట్టింది.

## వన్డే సిరీస్ ఓటమితో గిల్ కీలక నిర్ణయం..
### మళ్లీ దేశవాళీ క్రికెట్‌కు సై..!



టెస్టు, వన్డే సారథిగా పట్టాభిషేకం తర్వాత శుభ్‌మన్ గిల్ కు గడ్డుకాలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో సెంచరీలు మినహాయిస్తే వన్డే, టీ20ల్లో పేలవ ప్రదర్శనతో జట్టు ఓటమికి బాధ్యుడవుతున్నాడు గిల్. ఇండోర్ వన్డేలోనైనా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతాడనుకంటే 23 పరుగులకే వికెట్ పారేసుకున్నాడు. దాంతో.. మళ్లీ ఫామ్‌లోకి రావడం కోసం కీలక నిర్ణయం తీసుకున్నాడు గిల్. ఇటీవల నాయకుడిగా తేలిపోతున్న అతడు దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు.స్వదేశంలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో మెడ గాయంతో బ్రేక్ తీసుకున్న శుభ్‌మన్ గిల్.. పునరాగమనం తర్వాత నిరాశపరుస్తున్నాడు. న్యూజిలాండ్‌పై మూడు వన్డేల్లో అతడు ఒక్కటంటే ఒక్క అర్ధశతకం కాదుకదా జట్టును గెలిపించే పెద్ద ఇన్నింగ్స్ ఆడలేదు. నిర్ణయాత్మక మూడో వన్డేలోనూ 23 పరుగులకే జేమీసన్ ఓవర్లో బౌల్డయ్యాడు. దాంతో, మరోసారి 'ఇప్పుడే గిల్‌కు వన్డే కెప్టెన్సీ అవసరమా? కేఎల్ రాహుల్ ఉన్నాడుగా? 'అనే డిమాండ్లు వినిపిస్తున్నాయిఈ నేపథ్యంలో ఫామ్‌తో మళ్లీ మునపటి గిల్‌ను తలపించాలని అతడు.. కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్న భారత కెప్టెన్ ఇండోర్ నుంచి సోమవారం ఉదయమే ఢిల్లీ చేరుకున్నాడు. అక్కడి నుంచి రాజ్‌కోట్ వెళ్లనున్నాడు. అక్కడ జనవరి 22న స్వరాష్ట్రతో మ్యాచ్‌లో పంజాబ్ తరఫున గిల్ ఆడనున్నాడు. ఈ విషయాన్ని పంజాబ్ క్రికెట్ సంఘం ధ్రువీకరించింది.'రంజీ ట్రోఫీలో శుభ్‌మన్ గిల్ ఆడడపై స్పష్టత వచ్చింది. సౌరాష్ట్ర మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగనున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడడం కోసం భారత కెప్టెన్ 8 గంటలు విమాన ప్రయాణం చేయనున్నాడు. అంకితభావమంటే అది' అని పీసీఏ తెలిపింది. రంజీ ట్రోఫీలో పంజాబ్ జట్టు ఎలైట్ గ్రూప్ బీలో ఉంది

## భారత్‌లో ఆడకుంటే వేటు తథ్యం.. బంగ్లాదేశ్‌ను హెచ్చరించిన ఐసీసీ..!

పురుషుల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ మార్చాలని పట్టుపట్టిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ( కు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఆ బోర్డు ప్రతిపాదించిన 'గ్రూప్ స్వాపింగ్‌కు' అంగీకరించమని క్రికెట్ ఐర్లాండ్ స్పష్టం చేయడమే ఆలస్యం.. భారత్‌లోనే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆదేశించింది. కాదు.. కుదరదు అని బెట్టు చేస్తే కొత్త జట్టుకు అవకాశమిస్తామని బంగ్లా బోర్డును ఐసీసీ హెచ్చరించింది. అంతేకాదు ఆడుతారా? టోర్నీ నుంచి తప్పించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేసింది.భద్రతా కారణాలరీత్యా భారత్‌లో ప్రపంచకప్ ఆడకుండా ఉండేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(దీజదీ) చేస్తున్న ప్రయత్నాలు అన్నీ బెడిసి కొడుతున్నాయి. ఒక్కొక్కటిగా బంగ్లా బోర్డుకు అన్ని దారులు మూసుకుపోతున్నాయి. గ్రూప్



స్వాపింగ్ చేయాలని ఐసీసీకి విన్నవించుకున్నా నిరాశే ఎదురైంది. ఎందుకంటే.. తమను గ్రూప్ బీలోకి మార్చాలని అభ్యర్థించిన బంగ్లాదేశ్ ఆశలపై క్రికెట్ ఐర్లాండ్ నీళ్లు చల్లింది. ఎట్టిపరిస్థితుల్లోనూ గ్రూప్ మారబోమని, శ్రీలంకలోనే తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఆదివారం ఐర్లాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బంగ్లా బోర్డుకు మరో అవకాశమిచ్చింది ఐసీసీ. భారత్‌లోనే ప్రపంచకప్ ఆడాలని బంగ్లాకు స్పష్టం చేసింది. అందుకు అంగీకరించకుంటే.. ఏకంగా టోర్నీ నుంచే తప్పిస్తామని ఆ దేశ బోర్డును ఐసీసీ హెచ్చరించింది. మంకుపట్టు వదిలేసి ప్రపంచకప్ మ్యాచ్‌లు భారత్‌లో ఆడుతారా? టోర్నీ నుంచి తొలగించమంటారా? ఏదో ఒకటి తేల్చుకోండి. జనవరి 21 వరకూ మీ నిర్ణయాన్ని తెలియజేయాలని బంగ్లా బోర్డుకు స్పష్టం చేసింది ఐసీసీ. దాంతో.. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న బీసీబీ సభ్యులు 'అయ్యో.. ఇలా జరిగిందేంటీ?' అని తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ ఐసీసీ హెచ్చరికను బంగ్లాబోర్డు బేఖాతరు చేస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం దక్కనుందని సమాచారం.